## క్లుప్తంగా

### 19న మండల సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఈనెల 19న శుక్రవారం నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గజానన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో గ్రామాల్లో కొనసాగుతున్న కార్యక్రమాలపై సమీక్ష మాత్రమే ఉంటుందన్నారు. ఎలాంటి తీర్మానాలు ఉండవని పేర్కొన్నారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

### మొక్కలకు నీటిని అందించాలి



నర్సరీ వద్ద ఎంపీడీవో సురేశ్, సిబ్బంది

సోన్: ఎండల నేపథ్యంలో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఎంపీడీవో సురేశ్ అన్నారు. సోమవారం మండలంలోని సంగంపేట గ్రామంలో నర్సరీని, తాగునీటి సరఫరాను, మురుగు కాల్వలను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి రజిత, లింగం తదితరులు ఉన్నారు.

### సెల్‌ఫోన్ అప్పగింత

పెంబి: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన కర్రె సహదేవ్ సెల్‌ఫోన్ సోమవారం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రం వద్ద పోగొట్టుకున్నాడు. అటుగా వెళ్తున్న పెంబి బ్లూకోర్టు సిబ్బందికి ఫోన్ దొరకడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఫోన్‌లో ఉన్న వివరాల ఆధారంగా సాయంత్రం సహదేవ్‌కు హెడ్ కానిస్టేబుల్ రాజలింగం, సిబ్బంది ఫోన్ అప్పగించారు.

### ఇంటి నుంచే ఓటువేసే అవకాశం



మాట్లాడుతున్న నోడల్ అధికారి

కుంటాల: లోకసభ ఎన్నికల సందర్భంగా 85 ఏళ్లపైబడిన వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటుహక్కును ఇంటి నుంచే వినియోగించుకునే వెసులుబాటు కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని కుంటాల నోడల్ అధికారి ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి విడత మే 3 నుంచి 6వరకు, రెండో విడతలో 8న వీరికి ఓటు వేసే అవకాశం కల్పించినట్లు తెలిపారు. 2,238మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కోసం ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని వారు కోరారు.

### పాఠశాలలు తనిఖీ

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్ కాంప్లెక్స్ పరిధిలోని బీర్నంది, కొలాంగూడ, ఎర్వచింతల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సోమవారం కాంప్లెక్స్ హెచ్ఎం రమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న వార్షిక పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీఆర్పీ వనిత, ఉపాధ్యాయుడు రాజశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### సీఎంను కలిసిన నాయకులు



సీఎంతో మండల నాయకులు

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్ కలిసి శాలువాతో సన్మానించారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే



అవగాహన కల్పిస్తున్న టీచర్ ప్రభ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఈసీసీఈ డే (ఎర్లీ చైల్డ్ హుడ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ప్రభ మాట్లాడుతూ పిల్లల శారీరక, మేధో వికాసం, భాష నేర్చుకునే రీతులు, బడికి సంసిద్ధత చేయడంపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.

# ఆదమరిస్తే.. అంతే గతి

- ముథోల్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు కరువైన కంచెలు
- ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు



మహాలక్ష్మీ ఆలయం వెనుక రోడ్డు పక్కనే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



ముథోల్ నయాబాదిలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



తానూరు బైపాస్‌రోడ్డు మలుపు వద్ద..

ముథోల్: మండల కేంద్రంలో ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు లేక ప్రమాదకరంగా మారాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని కోట గల్లీ తానూర్ రోడ్డు మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు భయపడుతున్నారు. నాయాబాది చౌరస్తా సమీపంలో, మహాలక్ష్మీ ఆలయం వెనుక, సాయినగర్ కాలనీ రోడ్డులో బిగించిన ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా కంచె ఏర్పాటు చేయలేదు. ఇక్కడ నిత్యం పశువుల కాపర్లు పశువులను మేపుతుంటారు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కిందకు ఉండడంతో ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే పలుమార్లు పశువులు మృత్యువాత పడ్డాయని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని పశువుల యజమానులు, కాపరులు కోరుతున్నారు.

### కంచె లేక ఇబ్బందులు



ముథోల్‌లోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులకు ప్రమాదం జరుగుతుందని భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి. – సందీప్, ముథోల్

### అధికారులు స్పందించాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట తప్పనిసరిగా కంచెలు ఏర్పాటు చేయాలి. కంచె లేకుంటే పశువులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు ప్రమాదం జరగకముందే తక్షణం స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు బిగించాలి. – మనోరంజన్, ముథోల్

### ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

మండలవ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తాం. కంచె లేని వాటికి కంచెలను బిగించేలా ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – శ్రీకాంత్, విద్యుత్ ఏఈ

## అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్ (సాయినగర్)లో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిఆశీస్సులతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వారి వెంట బీజేపీ నాయకులు బి.గంగాధర్, మల్లేశ్వర్, గాలి రవి, గాలి రాజన్న, బాలాజీ, కాలనీవాసులు ఉన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు పటేల్ ఆలయంలో పూజలు చేశారు.

## అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



చిన్నారులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. దీనికి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో విద్యార్థులకు ఆసక్తి పెంపొందించేలా విద్య అందించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పలు అంశాలను శాస్త్రీయంగా, సృజనాత్మకంగా తెలియజేసి ఆదర్శంగా ఉండాలని కోరారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన పద్యాలు, కథలు, పజిల్స్, ఫన్నీ గేమ్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్ కాలనీకి చెందిన ఉప్పు నవీన్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం బెహరాన్ వెళ్లి.. అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.6 వేల నగదు, బియ్యం బస్తా, కిరాణ సామాగ్రిని అందజేశారు. నవీన్ మృతదేహం త్వరగా స్వగ్రామం వచ్చేలా అధికారులు, గల్ఫ్ సంఘాల నాయకులు కృషి చేయాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు. కార్యక్రమంలో జన్నారపు శంకర్, మెకానిక్ నవీన్, కతులాపురం ప్రవీణ్, దాత్రిక లక్ష్మణ్, కీర్తి రవి, లోకిని జాని, ఆసీఫ్‌అలీ, ఉన్నారు.

## ‘హక్కులు కాలరాసేలా కేంద్రం పాలన’



మాట్లాడుతున్న సభ్యురాలు రమ

ఖానాపూర్: మానవ హక్కులను కాలరాసేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలన కొనసాగుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.రమ అన్నారు. సోమవారం మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలోని జిల్లేడుకుంటలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అధ్యక్షతన జరిగిన పార్లమెంట్‌స్థాయి జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతుంటే కార్పొరేట్లకు మాత్రం లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు రూ.40వేల బ్యాంకు రుణం ఇవ్వలేని స్థితిలో కేంద్రప్రభుత్వం ఉందన్నారు. బీజేపీకి మరోసారి ఓటు వేసి గెలిపిస్తే దేశం వందేళ్లు వెనక్కిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాంలక్ష్మణ్, బక్కన్న, గంగన్న, లక్ష్మి, అంకుష్‌రావు, జగన్‌సింగ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



నిర్మల్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ఖానాపూర్ విన్యాసాలు ప్రదర్శిస్తున్న ఫైర్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో సోమవారం అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. అంతకుముందు జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయంలో ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్నిమాపక అధికారి జయత్‌రామ్ మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 20వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు 101కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: వేసవిలో అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఖానాపూర్ అధికారి ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో సిబ్బంది పలు విన్యాసాలు ప్రదర్శించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే ప్రజలు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది ముబీన్, శంకర్, సత్తన్న, దిలీప్, చిన్నయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

# వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు



నిర్మల్‌లో కల్యాణానికి తలంబ్రాలను సిద్ధం చేస్తున్న మహిళలు



కుంటాల: కల్లూర్‌లో..



భైంసారూరల్: ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు

నిర్మల్‌టౌన్: శ్రీరామనవమి నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వాల్మీకినగర్ రామాలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఏటా ఈ ఆలయానికి వేలాదిమంది భక్తులు వచ్చి రాములోరి కల్యాణం తిలకిస్తారు. ఇప్పటికే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నవమి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. సోమవారం కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, మంగళసూత్రాలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. అయ్యన్నగారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం పండితులు కీర్తి రాఘవశర్మ, రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో శాంతిపఠనం, మంగళశ్లోకాలు, వేదపారాయణం, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, యజ్ఞశాల ప్రవేశం, యజ్ఞదీక్ష, యోగిని స్థాపనం, సర్వతోభద్ర పూజ, లక్ష్మీనారాయణ సుదర్శన మండపారాధన, సీతారామచంద్ర ఆరాధన, మహాగణపతి హోమం, తదితర పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కుంటాల: శ్రీరామనవమి పురస్కరించుకొని మండలంలోని కల్లూర్ గ్రామంలో మహిళలు శ్రీ రాములోరి కల్యాణానికి అక్షింతలను తయారు చేశారు. కల్యాణం సందర్భంగా వడ్లను ఒలిచి అక్షింతలను భక్తులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

భైంసారూరల్: మండలంలోని కామోల్ రామాలయం శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమైంది. ఈ నెల 9 నుంచే నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు, రామదీక్షలు స్వీకరించిన స్వాములు ఆలయంలో భజనలు, ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. టెంట్లు ఏర్పాటు చేశారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న నడింపల్లె గ్రామానికి చెందిన మిల్కూరి నారాయణ తండ్రి బక్కన్న ఇటీవల మరణించాడు. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ప్రశాంత్‌రెడ్డి, చిప్ప దేవన్న, ప్రదీప్, మహేందర్ తదితరులు ఉన్నారు.

### ఘనంగా శ్రీచండీ యాగం

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ సమీపంలోని కాంచెరు పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో సాయిబాబా ఆలయ పురోహితులు కుసుమ నిర్మల–మల్లేశం దంపతుల ఆధ్వర్యంలో వసంత నవరాత్రిని పురస్కరించుకొని త్రయార్షిక పంచకుండాత్మక శ్రీ చండీయాగం నిర్వహిస్తున్నారు. సోమవారం మండలారాధన, దుర్గాదేవి అభిషేకం, లక్ష్మి గణపతి హోమం, రుద్రహోమం, మండపారాధన, దుర్గా అమ్మవారికి లలితా సహస్రనామాలచే కుంకుమార్చన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ బుక్యా జాన్సన్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో సోమవారం ఎస్సీ సంఘ భవనంలో అంబేద్కర్ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. అంబేద్కర్ సంఘం ధర్మోర కమిటీ అధ్యక్షుడిగా రొడ్డ సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా సొల్లు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా డిష్ పోశెట్టి, కార్యదర్శిగా రొడ్డ నరేశ్, సలహాదారుగా బొగ్గుల చిన్న పోశెట్టిలను ఎన్నుకున్నారు.

## బీజేపీ హయాంలోనే దేశాభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి



ఇంటింటి ప్రచారంలో లేగదూడ ఎత్తుకున్న అంజికుమార్‌రెడ్డి, పక్కన నాయకులు

లోకేశ్వరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాజూర గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నగేశ్‌ను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ్‌రెడ్డి, ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ సుమన్ కుమార్, జిల్లా సెక్రెటరీ నల్ల రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి సాయినాథ్‌పటేల్, బూత్ అధ్యక్షుడు అశోక్, రాజేశ్వర్, సరస్వతి ప్రవీణ్ ఉన్నారు.

## పారిశుధ్య పనులు చేయించాలి



చైర్మన్‌తో మాట్లాడుతున్న నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డి

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించి పారిశుధ్య పనులు చేపట్టి బస్టాండ్ శుభ్రంగా ఉండేలా చూడాలని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యంను కలిసి పారిశుధ్య సమస్యలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇక్కట్లను చైర్మన్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ పారిశుధ్య పనులు చేపడుతామని పేర్కొన్నారు. చెత్తను ఖాళీస్థలాల్లో కాక బస్టాండ్‌లో ఉన్న చెత్తడబ్బాల్లో వేసేలా ఆర్టీసీ సిబ్బంది చూడాలని చైర్మన్ అన్నారు. కౌన్సిలర్ కిశోర్‌నాయక్ ఉన్నారు.

### ‘17న శోభాయాత్ర విజయవంతం చేయండి’

భైంసాటౌన్: శ్రీరామనవమిని పురస్కరించుకుని పట్టణంలో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని హిందూ వాహిని మహిషా శాఖ నాయకులు కోరారు సోమవారం పట్టణంలోని నరసింహ కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 17న స్థానిక గోశాల నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా శోభాయాత్ర కొనసాగి ఏపీ నగర్‌లోని రాంలీలా మైదానంలో ముగుస్తుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో హిందూ వాహిని మహిషా పట్టణ నాయకులు చింతపండు నవీన్, ఆకుల రంజిత్, శ్రీకాంత్ ఉన్నారు.


## ‘బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి’



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్

కుంటాల: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు కృషి చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కల్లూర్‌లో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. ధైర్యంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. సమావేశంలో పార్టీ కన్వీనర్ పడకంటి దత్తాద్రి, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, నాయకులు దాసరి కిషన్, డాక్టర్ శ్రీనివాస్, చవాన్ రాజు, పవార్ రాజు, శివాజీ, లింగన్న, దత్తు, సుధాకర్, వంశీ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో వ్యక్తి మృతి



శ్రీనివాస్(ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ఎనగందుల శ్రీనివాస్(40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈయన కొద్ది రోజులుగా టీబీ(క్షయ) వ్యాధితో బాధపడుతున్నాడు. వీరిది పేదకుటుంబం కావడంతో ఈనెల 8న సాక్షిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో దాతలు స్పందించి రూ.25 వేల వరకు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. వైద్యాధికారులు ఇంటికి వెళ్లి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదివారం ఇంటికి తీసుకురాగా సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.